# మూడు పువ్వులు-ఆరుకాయలు

ఆ రోజు ఉదయాన్నే సూతుడు స్నానగానాదులు పూర్తి చేసుకుని వచ్చే సరికి, సూర్యభగవానుడు నైమిశారణ్యాన్ని తన భానురేఖలతో అందంగా అలంకరించి ఇంకొక ఎన్నారై కథ చెప్పుకోటానికి వాతావరణాన్ని అనుకూలంగా చేశాడు. శౌనకాది మునులందరూ చెట్టు నీడలో కూర్చుని సూతుడి రాక కోసం ఎదురు చూస్తున్నారు.

ఆయన అక్కడికి రాగానే గున్నమామిడి చెట్టు మీది మత్తకోకిల ఆహ్వానరాగాలు ఆహ్లాదంగా పాడింది.

చిన్నముని చిన్నగా అన్నాడు "ఇందాకట్నించీ మీ కోసం ఎదురు చూస్తున్నాం గురువుగారూ. ఎన్నారై కథల్లో మూడో కథ ఇక మొదలు పెట్టేయండి"

"అవును. మొదలు పెట్టేయండి" అన్నాడు శౌనకమహాముని. ఆయనకి కూడా ఈ కథల మీద ఉత్సాహం పెరిగింది మరి.

సూతుడు పచ్చగడ్డి మీద సుఖాసీనుడై, అందరినీ ఒకసారి తేరిపార చూసి మూడో కథ మొదలుపెట్టాడు.

యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్, ఆస్టిన్ నగరంలోనే కాక అమెరికాలోనే ప్రసిద్ధమైన యూనివర్సిటీల్లో ఒకటి. అక్కడ 55,000 పైన స్టూడెంట్లు వున్నారు. అమెరికాలో రెండవ పెద్ద యూనివర్సిటీ అది.

యూనివర్సిటీకి దగ్గరలో అదిఒక ఎపార్టుమెంటు కాంప్లెక్స్. అందులో అదొక మారుమూల ఎపార్టుమెంట్. ఆ ఎపార్టుమెంట్ తలుపులు తీసుకుని బయటకు వచ్చాడు ఒక ఇరవై నాలుగేళ్ళ రఘు.

"ఇదెప్పుడో కరుణశ్రీగారు రాసిన పద్యంలా.." మెల్లగా అన్నాడు చిన్నముని.

"ష్! ప్రతిదానికీ అలా అడ్డుపుల్ల వేయకూడదు" అన్నాడు శౌనకుడు పక్కన వున్న పుల్లమామిడి పుల్ల అడ్డంగా పడేస్తూ.

చిన్నముని వెనుకనే కూర్చున్న ఎర్రకోతి పకపకా నవ్వి, శౌనకుణ్ని చూసి చటుక్కున నోటిమీద వేలు వేసుకుంది.

సూతుడు తన కథ కొనసాగించాడు.

రఘు ఫిజిక్స్‌లో మూడేళ్ళుగా అక్కడ పిహెచ్‌డి చేస్తున్నాడు. ఇంకో ఆరునెలల్లో పూర్తిచేయాలని సర్వ ప్రయత్నం చేస్తున్నాడు.

అతను అక్కడి నించీ లాబ్‌కి నడిచి వస్తున్నప్పుడు ఎదురయాడు మురళి. మురళి కోయంబత్తూరు తమిళుడు. అతను రెండేళ్ళనించీ బిజినెస్ ఎడ్మినిస్ట్రేషన్‌లో పి.హెచ్.డి. చేస్తున్నాడు. అతను రఘుతో తప్ప ఇంకెవరితోనూ ఎక్కువగా కలవడు.

రఘుని చూసి అతనికి దగ్గరగా వచ్చి అన్నాడు. "రఘూ! ప్రొఫెసర్ మిల్లర్‌ని ఇప్పుడే కలిసి వస్తున్నాను"

"ఏమన్నాడు?" అడిగాడు రఘు.

"ఏమంటాడు. నేను చేస్తున్నది చాలదంటాడు. ఏమాత్రం ముందుకి పోనీయడు. ఏంచేయాలో తెలియటం లేదు" కొంచెం దిగులుగా అన్నాడు మురళి.

"అదే నాకూ అర్థంకావటం లేదు. నిన్నెందుకంత ఇబ్బంది పెడుతున్నాడో! మెబి వేరే ప్రోగ్రాంలో ఇంకో ప్రొఫెసర్ దగ్గర పని చేస్తే?"

మురళి అదోరకంగా నవ్వాడు. "ఇప్పటికి రెండేళ్ళు పైన గడిచిపోయాయి. ఇప్పుడు ప్రోగ్రాం మారిస్తే ఇంకో యుగం పడుతుంది. ముసలివాణ్ణి అయిపోతాను"

"అవును అదీ నిజమే! నీ ప్రోగ్రాం చాలత్వరగా నడుస్తున్నది కూడాను. అయినా ఒకసారి ఆయనతో మనసు విప్పి మాట్లాడరాదూ! ఆయన్నే అడగు అసలేం కావాలో. అదంతా డాక్యుమెంట్ చేసి, దాని ప్రకారం పూర్తి చేస్తే?" అన్నాడు రఘు సాలోచనగా.

"అదే చేసి వస్తున్నాను. ఎక్కడ వేసిన గొంగళి అక్కడేవుంది. ఆయన పద్ధతేమిటో అర్థంకావటం లేదు" నిరుత్సాహంగా అంటూ ముందుకు నడిచాడు మురళి.

రఘు నిట్టూర్చి లైబ్రరీ కేసి కదిలాడు.

ఒక తెల్లమ్మాయి, తెల్లబ్బాయి ఒకళ్ళ భుజాల మీద ఒకళ్ళు చేతులు పెనవేసుకుని, నెమ్మదిగా మాట్లాడుకుంటూ వెడుతున్నారు. మధ్యమధ్యలో ఆ పిల్ల అతన్ని ముద్దు పెట్టుకుంటున్నది కూడాను.

ఒకసారి అటూఇటూ చూసి తటపటాయిస్తూ అన్నాడు చిన్నముని "స్వామీ.. మనం మహోఋషులం కదా.... ఇలాటివి మాట్లాడుకోవచ్చా?"

శుకుడు అన్నాడు "జరుగుతున్న విషయాలను జరుగుతున్నట్టు చెప్పుకోవ

టంలో తప్పు లేదు నాయనా! అదీకాక ఒక స్త్రీ, ఒక పురుషుడికి దగ్గరవటం భగవంతుని సృష్టికి వ్యతిరేకం మాత్రం కాదు సుమా"

సూతుడు ఆజవాబుకి తన సమ్మతి తెలుపుతూ తలూపి కథ కొనసాగించాడు.

ఒక చైనీస్ కుర్రాడు వీపు మీద బాక్‌పాక్‌నిండా పుస్తకాలతో సైకిల్ తొక్కుతూ వెడుతున్నాడు.

"ఏయ్ రఘూ! నిన్నే!" అరిచింది సుమిత్ర పక్కనే వున్న బిల్డింగ్ మెట్లు దిగుతూ. రఘు సుమిత్రను చూసి "హాయ్" అన్నాడు నవ్వుతూ. హైద్రాబాద్‌లో విద్యానగర్‌లో, ఒకే సందులో ఉండేవాళ్ళు రఘూ, సుమిత్రా. చిన్నప్పటినించీ మంచి స్నేహితులు కూడానూ.

సుమిత్ర అంది "సహేలీ వాళ్ళ మీటింగుంది ఇవాళ సాయంత్రం. వస్తావా?"

సహేలీ ఒక స్వచ్ఛంద సేవా సంస్థ. గృహ సమస్యలతో భర్తల చేత బాధింపబడే స్త్రీలకు సహాయ సహకారాలందిస్తుంది. కొంతమంది భారతీయుల చేత ప్రారంభింపబడి మంచి పేరుబడిన సంస్థ. వారి కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటుంది సుమిత్ర. సుమిత్ర అక్కడే కంప్యూటర్ సైన్స్‌లో ఎం. ఎస్. డిగ్రీ చేస్తున్నది.

రఘు నవ్వాడు "నాకు అంత టైము లేదు సుమిత్రా! నా థీసిస్ త్వరలో పూర్తి చేయాలి. అప్పటిదాకా అన్ని కార్యక్రమాలకూ స్వస్తి"

"నీ పట్టుదల నాకు తెలుసు. చాల త్వరగా అవగొట్టేస్తున్నావ్ నీ పి.హెచ్.డిని. మధ్యలో నేనెందుకు అడ్డం రావటం"

రఘు చిన్నగానవ్వి అన్నాడు "నీకటు చదువు, పార్ట్ టైమ్ ఉద్యోగం, ఇటు ఇండియాకి సహాయ సహకారలిచ్చే రకరకాల కార్యక్రమాలు. నిన్నుచూసినప్పుడల్లా నాకు అనిపిస్తుంటుంది సుమిత్రా! నీలాగా నేను ఎందుకులేనా అని... "

గలగలా నవ్వింది సుమిత్ర "ఎందుకంటే నువ్వూ నేనూ ఒకటి కాదు కనుక. ప్రస్తుతం నువ్వు నీ పిహెచ్‌డి పూర్తిచేయటమే లక్ష్యంగా పెట్టుకోవాలి కనుక. రఘూ! ఇంకో ఆరునెలలు అవనీ. నేనే వచ్చి నీ సహాయం అడుగుతాను" సుమిత్ర ఒక్క సహేలీలోనేకాక, అనాధ పిల్లలకోసం పెట్టిన క్రై, ఇండియాకి సహాయపడే ఎయిడ్, భాగవతుల పరమేశ్వర్రావుగారి బిసిటి కార్యక్రమాల్లో తనకి వీలు దొరికినప్పుడల్లా ఉత్సాహంగా పాల్గొంటూనే వుంటుంది.

"తప్పకుండా సహాయం చేస్తాను. ప్లీజ్ లెట్ మీ నో" అని ముందుకు నడిచాడు రఘు.

స్పీడ్‌వే రోడ్డులోనించి, 21వ స్ట్రీట్‌లోకి తిరిగి, లైబ్రరీ వేపు వెడుతుండగా కలిశా

డు ప్రకాష్.

"రఘూ! ఇందాక తెలుగు అసోషియేషన్ ప్రెసిడెంట్ నారాయణగారు ఫోన్ చేశారు. ఉగాదికి స్టూడెంట్స్ చేత ఒక డ్రామా వేయిద్దామనుకుంటున్నారుట. వేద్దామంటావా?" అన్నాడు.

రఘు పెద్దగా నవ్వాడు "ఏయ్.. పోయినసారి వేశాం చాలదూ. మూడు నెలలు నా టైమంతా తినేశావు. మళ్ళీ నావల్ల కాదు" అన్నాడు.

"థీసిస్ రాస్తున్నాను. ఇప్పుడు చెయ్యి కుదరదంటావు. కానీ తప్పుతుందా! నేను గ్రీన్‌కార్డు అని ఒక డ్రామా రాశాను. రవి హరి సుబ్బారావ్ వేస్తున్నారు. ఇక ఒకే ఒక పాత్ర మిగిలింది. నువ్వు అది వేయకపోతే ఇంకెవరికన్నా ఇచ్చేయాల్సి వస్తుంది" అన్నాడు ప్రకాష్ బెదిరిస్తూ.

"ఆ పని చేయి బాబూ. నాకు మొదటి నెల జీతం రాగానే ఇండియన్ రెస్టారెంటీలో నీకు ధర్మపిండం పెట్టిస్తాను... " అని ముందుకు కదిలాడు రఘు.

లైబ్రరీ కౌంటర్ దగ్గర పనిచేస్తున్నది కవిత. రఘుని చూసి చిన్నగా నవ్వింది. కవితది డల్లాస్. అమెరికాలోనే పుట్టి పెరిగింది. సైకాలజీలో ఎం.ఎస్. చేస్తూ, యూనివర్సిటీ లైబ్రరీలో పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తున్నది.

రఘు కూడా నవ్వి కౌంటర్ దగ్గరకు వచ్చాడు.

అప్పటి దాకా కవితతో మాట్లాడుతున్న అతను రఘుని చూసి చిరునవ్వు నవ్వాడు.

కవిత "రఘూ! నువ్వు అడిగిన పుస్తకం నిన్ననే వచ్చింది. నీ కోసం ఇక్కడే వుంచాను" అంటూ కౌంటర్ పక్కనించీ ఆ పుస్తకాన్ని తీసి, రఘు కార్డు తీసుకుని అతని పేర ఆ పుస్తకాన్ని చెకౌట్ చేసింది.

"థాంక్స్ కవితా. ఈపుస్తకం కోసమే వచ్చాను లైబ్రరీకి. చాల థాంక్స్"

"రఘూ! నీకు ఇతను తెలుసా? కుమార్. వీళ్ళది న్యూఆర్లీన్స్"

"హాయ్! నేనిక్కడ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదువుతున్నాను "అతని ఇంగ్లీష్ పూర్తిగా అమెరికన్ ఏక్సెంట్‌లో వుంది.

రఘు అడిగాడు "ఇండియాలో మీదే ఊరు" అని.

కుమార్ నవ్వి "నేను పుట్టిందీ, పెరిగిందీ అమెరికాలోనే. మీ ఉద్దేశ్యం, నాతల్లిదండ్రులది ఇండియాలో ఏ ఊరు అనయితే, మా అమ్మది గుడివాడ. మా నాన్నది గుంటూరు. నేను చిన్నప్పుడు ఎప్పుడో ఇండియాకి వెళ్ళాను కానీగత పదిహేనేళ్ళుగా వెళ్ళలేదు" అన్నాడు.

రఘుకూడా నవ్వి, ముందుకు కదిలాడు.

కుమార్‌తో అంటున్నది కవిత. "మా నాన్న ఈమధ్య నాతో నా పెళ్ళి విషయం అడిగాడు. ఇండియాలో అబ్బాయిని చేసుకుంటావా, అమెరికాలో పుట్టిన ఇండియన్ ఆరిజన్ అబ్బాయిని చేసుకుంటావా అని"

"మరి ఏం చెప్పావ్?" నవ్వుతూ అడిగాడతను.

"నేను పుట్టి పెరిగింది ఇక్కడే కనుక, నాకూ అలాటివాడే కావాలన్నాను. అమెరికన్లను మాత్రం చేసుకోకు, మనవాళ్ళనే చేసుకో అన్నది మా అమ్మ"

"నువ్వేం చెప్పావ్?"

కవ్వింపుగా నవ్వింది కవిత "మా అమ్మతో ఇండియాలో పుట్టి పెరిగిన అబ్బాయి వద్దు. ఇద్దరికీ సాంస్కృతికపరంగా కంపాటిబిలిటీ వుండటం కష్టం. ఇక్కడి ఇండియన్ ఆరిజన్ కుర్రాడ్నే చేసుకుంటాను.. అని చెప్పాను"

"అలా అయితే నేను అలాటివాడినేకదా.. మరి నన్ను చేసుకోవా?"

"నువ్వంటే నాకు ఇష్టమేకానీ, ఇంకా నేనొక నిశ్చయానికి రాలేదు. చూద్దాం" అన్నది కవిత.

"ఒకటి మాత్రం గుర్తుంచుకో. నిన్ను పెళ్ళిచేసుకోటానికి నేను సిద్ధంగా వున్నాను" అన్నాడు కుమార్ కవిత చేయి పట్టుకుని మృదువుగా ఒత్తుతూ.

రఘు లైబ్రరీలోనించి బయటకు వచ్చి, డిపార్టుమెంట్ వేపు వెడుతుంటే ఎదురు పడింది సమీర. సమీర తండ్రి భారతీయుడైనా, తల్లి అమెరికన్ అవటంవల్ల సమీర చాల తెల్లగా, నీలం కళ్ళతో, బ్లాండ్ జుట్టుతో అచ్చం వాళ్ళమ్మలాగానే అందంగా వుంటుంది. సమీర తండ్రి దగ్గర బెంగాలీ నేర్చుకోవటమే కాక, తల్లి ప్రోత్సాహంతో రవీంద్ర సంగీతం పాడటంలోనూ, దానికి తగ్గ డాన్స్ చేయటంలోనూ మంచి పేరు సంపాదించుకున్నది.

సమీరని చూసి పరుగెత్తుకుంటూ వచ్చాడు నిస్సార్. సమీరని చూసి అదోలా నవ్వి "సమీరా! నువ్వు నన్ను ఎవాయిడ్ చేస్తున్నావు. నేనారోజు సరిగ్గా ప్రవర్తించలేదని నాకు తెలుసు.. ఐ యామ్ సారీ.. " అన్నాడు.

"నిస్సార్! ఇక నీతో నాకేమీ సంబంధం లేదు. ఏదో బంగ్లాదేశ్ వాడివి కనుక బెంగాలీలో మాట్లాడుతుంటే నీతో స్నేహం చేశాను. ఇక నాతో మాట్లాడకు. నన్ను విసిగిస్తే పోలీసులకి రిపోర్ట్ చేయాల్సి వస్తుంది" అని అతనితో గట్టిగా అని, రఘుని చూసి "హాయ్ రఘూ! ఎలావున్నావ్?" అని అడిగింది.

నిస్సార్ సమీర వేపోసారి సూటిగా చూసి, తల వంచుకుని అక్కడనించీ వెళ్ళిపోయాడు.

"సారీ సమీరా.... నువ్వేదో కోపంలో వున్నట్టున్నావు" అన్నాడు రఘు.

"లేదు రఘూ! నిస్సార్ నన్ను బాదర్ చేస్తున్నాడు. నేను త్వరలో జార్జినిపెళ్ళి చేసుకోబోతున్నాని అతనికి చెప్పి వదిలించుకుంటాను. నా థీసిస్ వర్క్ కూడా దాదాపు అయిపోయినట్టే" అన్నది అక్కడే బయో కెమిస్ట్రీలో పి. హెచ్. డి. చేస్తున్న సమీర.

"కంగ్రాట్యులేషన్స్ సమీరా! జార్జిని పెళ్లిచేసుకోబోతున్నందుకు ఒకసారీ, నీ థీసిస్ అయిపోతున్నందుకు ఇంకోసారి"

సమీర నవ్వింది. "జార్జీ, నేనూ ఇంకా ఏమీ అనుకోలేదు. అతను నన్ను అడగ లేదు ఇంకా" అన్నది.

రఘు కూడా నవ్వి "నేను డిపార్ట్‌మెంట్‌కి వెళ్ళాలి. మళ్ళీ కలుస్తాను" అంటూ ముందుకి కదిలాడు.

డిపార్టుమెంటుకి వెళ్ళి తన పని చేసుకుంటుంటే అక్కడికి వచ్చాడు సుండార్. అతను ఫిజి ఐలండ్ నించి వచ్చాడు. అతని తల్లిదండ్రులు మూడు తరాల నించీ ఫిజిలో ఉంటున్నారు. సుండార్‌కి ఇండియా గురించి పుస్తకాల్లో చదివే విషయాలు తప్ప వేరే ఏమీ తెలియదు. అతని పేరు ఇండియాలో అయితే సుందర్ అయుండేది.

"రఘూ! నీ అపార్ట్‌మెంట్‌కి పిలిచి నాకు ఇండియన్ భోజనం పెడతానన్నావు. ఇంతవరకూ మాట నిలబెట్టుకోలేదు నువ్వు. ఎప్పుడు రమ్మంటావ్?" అని సూటిగా అడిగాడు.

"నేను చాల బిజీగా వుంటున్నాను సుండార్.... కానీ.. దీనికి అంతులేదు. ఇదెప్పుడూవుండేదే. ఒక పనిచేద్దాం. రేపు సాయంత్రం రా. నీకు వండిపెడతాను"

"ఏం వండి పెడతావ్?"

రఘు నవ్వి "నా ఉద్దేశ్యంలో ప్రపంచంలోని అన్ని ఇన్వెన్‌షన్లలోనూ, మరీ గొప్పవి మూడు. వంకాయకూర మామిడికాయపప్పు గోంగూర పచ్చడి. వాటిల్లో ఏవో రెండు చేసి పెడతాను. ఓకే" అన్నాడు.

సుండార్ నవ్వి "అలాగే" అని తన పనిలో నిమగ్నమయి పోయాడు.

బల్లమీద ఫోన్ మ్రోగింది. ఫోన్‌లో సుమిత్ర. వణుకుతున్న గొంతుతో చెబుతున్నది. "రఘూ! నీకిది తెలుసా. వాళ్ళ ప్రొఫెసర్ తన పిహెచ్‌డి పూర్తి కానీయకుండా ఇబ్బంది పెడుతున్నాడని బాగా నిరుత్సాహపడి మురళి ఆత్మహత్య చేసుకుంటానని ఒక ఉత్తరం రాసి పెట్టి వెళ్ళిపోయాడుట. ఎక్కడా కనపడటం లేదుట. అతని రూమ్మేట్ రిపోర్టు చేస్తే, పోలీసులు అతని కోసం వెతుకుతున్నారుట"

రఘుకి ఒక్క క్షణం గుండె ఆగినంత పనయింది. వెంటనే తేరుకుని అన్నాడు

"అదేమిటి అంత అర్ధంలేని పనిచేస్తున్నాడు. ఉండు. వస్తున్నాను. ఇద్దరం కలిసి వెడధాం" అని బయటకు పరుగెత్తాడు.

సూతుడు కథ చెప్పటం ఆపాడు. పచ్చని ఆకుల మధ్యన వున్న ఆకుపచ్చని రామచిలుక "అయితే మురళి చచ్చిపోయాడా?" అని అడిగింది గాభరా పడుతూ, క్రింద పడకుండా చెట్టుకొమ్మని గట్టిగా పట్టుకుని.

ఎర్రకోతి ముఖం ఎర్రబడుతుండగా అన్నది "నాకు ట్రాజెడీలంటే అస్సలు ఇష్టం లేదు బాబూ. ఈ కథకు ఎండింగ్ ఇలాగే వదిలేయండి" అన్నది.

చిన్నముని "నాకో అనుమానం గురూగారూ! ఆనాడు నారదులవారు ఇంద్ర లోకం మీదుగా, వైకుంఠం కైలాసాలకు వెళ్ళి అందర్నీ పలకరించి వచ్చినట్టుగా రఘు ద్వారా అదే ధోరణిలో కథ నడిపించారేమిటీ! అదీకాక ఈ కథకు మూడు పువ్వులూ, ఆరు కాయలూ అని పేరు పెట్టారెందుకు" అని అడిగాడు, తన చేతిలోని అరడజను మామిడికాయలనీ అంగవస్త్రంలో దాచిపెట్టి.

శౌనకుడు చిరునవ్వు ఆపుకోబోయి, కోలేక పెద్దగా నవ్వేసి ఇలా అన్నాడు. "ఆమాత్రం అర్ధం కాలేదు కనకనే ఇంకా చిన్నమునిగా మిగిలిపోయావు. ఈ కథలో సుమిత్ర, కవిత, సమీర మూడు పువ్వులు. రఘు, మురళి, ప్రకాష్, కుమార్, నిస్సార్, సుండార్‌లు ఆరు కాయలు. అమెరికాలోని యూనివర్సిటీలలో రకరకాల భారతీయుల మనస్థత్వాలను అలా పైపైన చూపించటమే ముఖ్యోద్దేశంగా వ్రాసినదీ కథ. కథకు వుండ వలసిన లక్షణం నా ఉద్దేశ్యంలో ఒక్కటే. చెప్పదలుచుకున్న విషయం, వినేవాళ్ళకీ, చదివే వాళ్ళకీ మనసుకి హత్తుకునేట్టుగా చెప్పటం. వాటిల్లో ఇదో పద్ధతి"

ఎర్రకోతి గుర్రుగా చూసి "అంటే ఓ శ్నాప్‌షాట్ ఇచ్చారన్నమాట. అయితే ఇంకచాలు బాబూ. నాకీ పచ్చి మామిడికాయలు చూస్తుంటే నోరూరుతున్నది. వాటి ల్లో ఉప్పూకారం నంచుకుతింటే బాగుంటుందని మా అమ్మ ఎప్పుడూ చెబుతుంటుంది" అని, రెండు మామిడికాయలు తీసుకుని గెంతుకుంటూ వెళ్ళిపోయింది.

"ఇక మనంకూడా వెడదామా" అని సూతుడు లేచి, తను కూడా రెండు పచ్చి మామిడికాయలు చేతపుచ్చుకుని తన ఆశ్రమం వేపు దారి తీశాడు. ✿